
## గుంపులు గుంపులుగా..



బీబీపేట్ మండలం మాందాపూర్‌లో కుక్కల గుంపు

ఉభయ జిల్లాల్లో వీధి కుక్కల బెడద తీవ్రమైంది. పల్లె, పట్టణమనే తేడా లేకుండా అంతటా ఇదే పరిస్థితి నెలకొన్నది. ఎక్కడ చూసినా శునకాలే కనిపిస్తున్నాయి. రోడ్ల మీద గుంపులుగా తిరుగుతూ జనాల్ని భయపెట్టిస్తున్నాయి. కనబడిన వారిపై దాడులకు పాల్పడుతూ పిక్కలు పీకుతున్నాయి. నిత్యం ఎక్కడో ఒక చోట కుక్క కాటు కేసులు నమోదవుతున్నాయి. పంచాయతీలు, మున్సిపాలిటీల్లో శునకాల గుంపులు స్వైర విహారం చేస్తుంటే యంత్రాంగం మొద్దు నిద్ర పోతున్నది. అటు ప్రభుత్వం కానీ, ఇటు అధికారుల నుంచి కానీ శునక దాడులపై స్పందనే లేకుండా పోయింది. గతంలో హైదరాబాద్‌లో ఓ పిల్లాడ్ని కుక్కలు అతిదారుణంగా చంపేసిన ఉదంతం తర్వాత కొద్దిగా హడావుడి చేసినా ఆ తర్వాత పెద్దగా మార్పు రాలేదు.

### హైకోర్టు ఆదేశాలున్నా..

ఇటీవల కుక్కల దాడులు పెరిగి పోతుండడంపై రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం సైతం ఆందోళన వ్యక్తం చేసింది. శునకాల దాడులపై కేవలం సమావేశాలు, సూచనలతో సరిపెట్టకుడా సమగ్ర కార్యాచరణ రూపొందించాలని గత నెలలోనే హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. వాటి పునరుత్పత్తి నియంత్రణ నిబంధనల అమలుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. కుక్క కాటు, వీధి కుక్కలపై ఫిర్యాదులు అందిన 24 గంటల్లోగా వాటిని పట్టుకోవడానికి వాహనాలను అందుబాటులో ఉంచాలని సూచించింది. కానీ ఎక్కడా హైకోర్టు ఆదేశాలు అమలైనట్లు కనిపించడం లేదు.

### ఇప్పటికైనా స్పందిస్తారా?

తాజాగా నందిపేట్, మాచారెడ్డి మండలాల్లో 12 మంది కుక్క కాటుకు గురైన నేపథ్యంలోనైనా అధికారులు స్పందిస్తారో లేదో చూడాలి. స్థానిక సంస్థలు పట్టించుకుని కుక్కలను నియంత్రించాలని ప్రజలు కోరుతున్నారు. లేకపోతే హైదరాబాద్‌లో బాలుడి ఉదంతం లాంటి ఘటనలు మన దగ్గరా చోటు చేసుకునే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## గుండెల నిండా.. 'వెండి' కొండ



ఏకదంతుడు.. విభిన్న రూపుడు. నవరాత్రులు పూజలందుకునే వినాయకుడ్ని భక్తులు ఒక్కో రకంగా పూజిస్తుంటారు. మట్టి, పీవోపీతో రూపొందించిన విగ్రహాలను అశేష భక్తిభావంతో కొలుస్తుంటారు. అయితే, రాజంపేట్‌లో మాత్రం హిందూదళ్ ప్రతినిధులు వెండితో బొజ్జ గణపయ్యను ముస్తాబు చేసి ఆరాధిస్తున్నారు. పీవోపీతో తయారుచేసిన విగ్రహానికి మూడు కిలోల వెండితో కూడిన 3,500 కాయిన్లను అమర్చి సుందరంగా తీర్చిదిద్ది ప్రతిష్ఠించారు. విద్యుత్ కాంతుల్లో ధగధగ మెరిసిపోతున్న ఆ విఘ్నేశ్వరుడిని చూసేందుకు, కొలిచేందుకు భక్తులు తరలివస్తున్నారు. నిమజ్జనం రోజున వెండి కాయిన్లను తీసి భక్తులకు పంపిణీ చేయనున్నట్లు హిందూదళ్ ప్రతినిధులు తెలిపారు.

– రాజంపేట్, సెప్టెంబర్ 9

# వీధికుక్కల వీరంగం

ఖలీల్‌వాడి/ బీబీపేట్, సెప్టెంబర్ 9 : వీధికుక్కలు వీరంగం సృష్టిస్తున్నాయి. కనబడ్డ వారిపై దాడులు చేస్తూ గాయపరుస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలో నిత్యం ఎక్కడో ఒకచోట శునకాలు స్వైరం విహారం చేస్తుండడం కలవరపాటుకు గురి చేస్తున్నది. తాజాగా నందిపేట్ మండలంలో పది మందిపై దాడి చేశాయి. అలాగే, మాచారెడ్డిలో మరో ఇద్దరిని గాయపరిచాయి. వరుసగా చోటు చేసుకుంటున్న ఈ ఘటనలు ప్రజలను భయాందోళనకు గురి చేస్తున్నాయి. కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల్లో కుక్క కాట్ల కేసులు పెరిగి పోతున్నా.. యంత్రాంగం పట్టనట్టు వ్యవహరిస్తుండడం విమర్శలకు తావిస్తున్నది.

- రెచ్చిపోతున్న శునకాలు
- ఉమ్మడి జిల్లాలో ప్రతి నిత్యం దాడులు
- తాజాగా నందిపేట్‌లో పది మందిపై దాడి
- మాచారెడ్డిలోనూ ఇద్దరిని కరిచిన కుక్కలు
- పట్టించుకోని యంత్రాంగం
- నియంత్రణ చర్యలు చేపట్టని అధికారులు





### నందిపేట్‌లో 10 మందికి.. మాచారెడ్డిలో ఇద్దరికి..

నందిపేట్/మాచారెడ్డి, సెప్టెంబర్ 9 : సోమవారం నందిపేట్ మండల కేంద్రంలో పది మందిపై ఓ పిచ్చికుక్క దాడి చేసి తీవ్రంగా గాయపర్చింది. ఓ ప్రైవేట్ పాఠశాల విద్యార్థితోపాటు ప్రైవేట్ దవాఖానలో ఆయమ్మగా పనిచేస్తున్న లసుంబాయి అనే వృద్ధురాలిపై దాడి చేయగా.. వారికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానిక పీహెచ్‌సీలో వృద్ధురాలికి ప్రథమ చికిత్స అందించి జిల్లా దవాఖానకు పంపించినట్లు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రవీణ్ తెలిపారు. కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలంలోని గజ్యానాయక్‌తండా ఎక్స్‌రోడ్ పరిధిలో రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న గ్రామానికి చెందిన దాసరి మౌనిక, మ్యాడం అనసూయపై పిచ్చికుక్క దాడి చేసింది. దీంతో వారు స్థానిక పీహెచ్‌సీలో చికిత్స తీసుకున్నారు.


కుక్కల దాడిలో గాయపడిన నందిపేట గ్రామస్తులు

### లెక్కలేనన్ని కేసులు..

- నందిపేట్ మండల కేంద్రంలో కుక్కల బెడద తీవ్రంగా ఉంది. సోమవారం 10 మందిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి.
- మాచారెడ్డి మండలంలోని గజ్యానాయక్ తండా ఎక్స్ రోడ్ పరిధిలోనూ ఓ కుక్క దాడి చేయడంతో ఇద్దరు గాయపడ్డారు. గ్రామానికి చెందిన దాసరి మౌనిక, మ్యాడం అనసూయ సోమవారం నడుచుకుంటూ వెళ్తుండగా కుక్క దాడి చేసి గాయపరిచింది.
- బీర్కూర్ మండలంలో ఆదివారం ఓ బాలుడిపై కుక్కలు దాడి చేశాయి.
- గత నెల 28న ఆర్మూర్ పట్టణంలోని పోచమ్మ కాలనీలో ఇంటి ఎదుట ఆడుకుంటున్న బాలుడిపై పిచ్చి కుక్క దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది.
- ఆగస్టు 23న పోతంగల్ మండలం హంగర్గఫారంలో నడుచుకుంటూ వెళ్తున్న ఐదేండ్ల బాలుడు షేక్ జమీర్‌పై నాలుగు కుక్కలు విరుచుకుపడ్డాయి. బాలుడి వెనుకే ఉన్న అతడి అమ్మమ్మ ఎదురు తిరగడంతో జమీర్ ప్రాణాలతో బయటపడ్డాడు.
- ఆగస్టు 11న ఆర్మూర్ మండలం చేపూర్‌లో ఏడుగురిపై కుక్కల గుంపు దాడికి పాల్పడింది.
- అదే నెల 8వ తేదీన బోధన్‌లోని హనుమమాన్ టేకిడీ కాలనీలో ఆడుకుంటున్న బాలుడ్ని గాయపరిచాయి.
- ఆగస్టు 6న ఎడపల్లి మండలం పోచారం గ్రామంలోనూ పలువురిపై దాడికి పాల్పడ్డాయి.

### డాగ్ బైట్ కేసులు ఏటా వేలల్లోనే..

ఉమ్మడి జిల్లాలో ఏటా వేలాది మంది కుక్క కాటుకు గురవుతున్నారు. రెండు జిల్లాల్లో కలిపి వేలాది సంఖ్యలో డాగ్ బైట్ కేసులు నమోదవుతున్నాయి. అధికారుల లెక్కల ప్రకారం.. ఒక్క నిజామాబాద్ జిల్లాలోనే గతేడాది 4,416 కేసులు నమోదయ్యాయి. ఈ ఏడాది జూలై 7 వరకు 2 వేల మందికి పైగా కుక్కల దాడులకు బాధితులుగా మారారు. మరోవైపు, అధికారులు చెబుతున్న లెక్కలకు రెట్టింపు స్థాయిలో డాగ్ బైట్ కేసులు ఉంటున్నాయి.





'ఇందూరు'లో డాగ్‌బైట్ కేసులు..

| సంవత్సరం | కుక్క కాటు కేసులు |
|---|---|
| 2023 | 4416 |
| 2024 (జూలై వరకు) | 2080 |

## శ్రీరాంసాగర్‌కు తగ్గిన ఇన్‌ఫ్లో

మోర్తాడ్/నిజాంసాగర్, సెప్టెంబర్ 9 : నిజామాబాద్ జిల్లాలోని శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు వరద తగ్గుముఖం పట్టింది. దీంతో గేట్లను మూసివేశారు. ఎగువ ప్రాంతాల నుంచి గురువారం సాయంత్రానికి 26 వేల క్యూసెక్కులకు పైగా ఇన్‌ఫ్లో వచ్చి చేరుతుండగా, అంతే మొత్తంలో అవుట్‌ఫ్లో రూపంలో వెళ్తున్నది. వరద కాలువకు 18 వేలు, కాకతీయ కాలువకు 4 వేలు, ఎస్కేప్ గేట్ల ద్వారా 4 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఎస్సారెస్పీ పూర్తి స్థాయి నీటిమట్టంతో 1090.90 అడుగులు (80.053 టీఎంసీలు) నిండుకుండలా కనిపిస్తున్నది.

**నిజాంసాగర్ గేట్ల మూసివేత**

కామారెడ్డి జిల్లాలోని నిజాంసాగర్ ప్రాజెక్టుకు సైతం వరద తగ్గడంతో సోమవారం గేట్లను మూసివేశారు. సోమవారం సాయంత్రానికి 17,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతున్నది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 1405.00 అడుగులు (17.802 టీఎంసీలు) కాగా, ప్రస్తుతం 1404.76 అడుగుల (17.455 టీఎంసీలు) నీరు నిల్వ ఉందని ఏఈ శివప్రసాద్ తెలిపారు. గత ఐదు రోజుల్లో సుమారు 10 టీఎంసీల మిగులు జలాలను దిగువకు విడుదల చేశామన్నారు.



నిండుకుండలా నిజాంసాగర్ ప్రాజెక్టు

## గోదావరిలో గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం

మోర్తాడ్, సెప్టెంబర్ 9: ఎస్సారెస్పీ సందర్శనకు వెళ్లి, గోదావరిలో ఆదివారం గల్లంతైన ముంబైకి చెందిన ఫిరోజ్ అహ్మద్‌ఖాన్ మృతదేహం సోమవారం సాయంత్రం లభ్యమైంది. ఫిరోజ్ నదిలో పడిపోయిన ప్రాంతం నుంచి దాదాపు 250 మీటర్ల దూరంలో బండలు, పొదల్లో చిక్కుకున్నాడు. సోమవారం ప్రాజెక్టు గేట్లు మూసివేయడంతో వరదప్రవాహం తగ్గిన కారణంగా ఫిరోజ్ మృతదేహాన్ని గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని వెలికి తీయించి పోస్టుమార్టానికి తరలించినట్లు ఎస్సై నారాయణ తెలిపారు.

## మండపం వద్ద విషాదం విద్యుత్ షాక్‌తో బాలుడి మృతి

- పండక్కి ఇంటికి వచ్చి దుర్మరణం



సంజీవ్ (ఫైల్)

సిరికొండ, సెప్టెంబర్ 9: వినాయక చవితి పండుగ సందర్భంగా పాఠశాలలకు సెలవు ఉండడంతో ఇంటికి వచ్చిన బాలుడు తిరిగిరాని లోకాలకు వెళ్లాడు. నిజామాబాద్ జిల్లా సిరికొండ మండలం కొండాపూర్ గ్రామ పరిధిలోని తాళ్ల తండాలో ఆదివారం రాత్రి ఈ విషాదకర ఘటన చోటు చేసుకున్నది. తండాకు చెందిన సంతోష్‌నాయక్ కుమారుడు సంజీవ్ (15) కామారెడ్డిలో చదువుకుంటున్నాడు. వినాయకచవితి సందర్భంగా పాఠశాలకు సెలవు ఉండడంతో ఇంటికి వచ్చాడు. ఆదివారం రాత్రి వినాయక మండపం వద్ద సౌండ్‌బాక్స్ వైర్లు మార్చుతుండగా ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్‌కు గురయ్యాడు. తీవ్రంగా గాయపడిన అతడ్ని కామారెడ్డి దవాఖానకు తరలించగా.. చికిత్స పొందుతూ మృతిచెందాడు. సోమవారం మధ్యాహ్నం అంత్యక్రియలు నిర్వహించారు.

## అక్షర తపస్వికి ఘన నివాళి

కామారెడ్డి కలెక్టరేట్‌లో ప్రజాకవి, పద్మవిభూషణ్ కాళోజీ నారాయణరావు జయంతిని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

–కామారెడ్డి, సెప్టెంబర్ 9



## 'కామారెడ్డి బీసీ డిక్లరేషన్' వెంటనే అమలుచేయాలి

- బీసీ విద్యార్థి సంఘం నాయకుల డిమాండ్
- పూలే విగ్రహానికి వినతిపత్రం అందజేత



కామారెడ్డిలో పూలే విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న బీసీ విద్యార్థి సంఘం నాయకులు

కామారెడ్డి, సెప్టెంబర్ 9 : కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను వెంటనే అమలుచేయాలని బీసీ విద్యార్థి సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు కామారెడ్డి మున్సిపల్ కార్యాలయం ఎదుట పూలే విగ్రహానికి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీసీ విద్యార్థి సంఘం నాయకులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ తన మేనిఫెస్టో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని కామారెడ్డిలో బీసీ డిక్లరేషన్‌ను విడుదల చేసిందని గుర్తుచేశారు. ఇచ్చిన హామీ ప్రకారం వెంటనే సమగ్ర కులగణన సర్వే చేపట్టి, బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు నీల నాగరాజు,ప్రధాన కార్యదర్శి దయాకర్, ప్రతినిధులు సుమేర్, రాహుల్, రవి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## తైక్వాండో నేషనల్ చాంపియన్‌షిప్‌కు జిల్లా క్రీడాకారిణులు ఎంపిక

- అభినందించిన జిల్లా జడ్జి సునీత కుంచాల



క్రీడాకారిణులను అభినందిస్తున్న జిల్లా జడ్జి సునీత కుంచాల

వినాయక్‌నగర్, సెప్టెంబర్ 9: ఖేలో ఇండియా ఉమెన్స్ త్వైకాండో –24 నేషనల్ చాంపియన్ షిప్ పోటీలకు జిల్లా నుంచి ఇద్దరు క్రీడాకారిణులు ఎంపికైనట్లు త్వైకాండో కోచ్ మనోజ్ కుమార్ తెలిపారు. సీనియర్ విభాగంలో చౌట్‌పల్లి నేహ (బ్లాక్ బెల్ట్), జూనియర్ విభాగంలో వై.సాక్షి అక్షర ఎంపికైనట్లు పేర్కొన్నారు. వీరు ఈ నెల 11 నుంచి 14 వరకు తమిళనాడులోని డిండిగల్ జిల్లా కేంద్రంలో ఉన్న మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించనున్న పోటీల్లో పాల్గొంటారని వివరించారు. ఈ సందర్భంగా క్రీడాకారిణులను జిల్లా జడ్జి సునీత కుంచాల సోమవారం అభినందించారు. విజయం సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో తైక్వాండో జిల్లా కోశాధికారి వెంకటరమణా గౌడ్, సాక్షి సంతోష్, కోచ్ మనోజ్ పాల్గొన్నారు.

## 'తెగుళ్ల'తో దిగులు



బోర్లం క్యాంపు శివారులో తెగుళ్లు సోకి ఎండిపోతున్న వరి పంట

బాన్సువాడ రూరల్, సెప్టెంబర్ 9 : ఉమ్మడి జిల్లాలోని పలు మండలాల్లో పొట్టదశలో ఉన్న వరి పంటలకు సోకుతున్న ఎండాకు తెగుళ్లతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కామారెడ్డి జిల్లా బాన్సువాడ మండలంలోని బోర్లం, కొయ్యగుట్ట, పోచారం, ఇబ్రహీంపేట్, రాంపూర్, దేశాయిపేట్ తదితర గ్రామాల్లో వరి పంటకు ఎండాకు తెగులు సోకి ఎండిపోతున్నది. దీంతో చేతికి వచ్చిన పంట ఎక్కడ ఎండిపోతుందో అని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తెగుళ్ల నివారణకు వేల రూపాయలు ఖర్చు చేసి మందులు పిచికారీ చేసినా ప్రయోజనం లేకపోయిందని వాపోతున్నారు. ఈ విషయాన్ని వ్యవసాయాధికారుల దృష్టికి తీసుకెళ్లినా లాభం లేకపోయిందని చెబుతున్నారు. వాతావరణంలో మార్పుల వల్ల వరి పంటకు ఎండాకు తెగులు సోకుతున్నట్లు ఏఈవో రాణి తెలిపారు. ఎకరాకు కేజీ కాపర్ ఆక్సీక్లోరైడ్ ద్రావణాన్ని లేదా గుళికలు వేస్తే తెగుళ్లను నివారించవచ్చని రైతులకు సూచించారు.